# రాజకీయ చైతన్యం

(గల్పిక)

సుబ్బారాయుడు చాలా కోపంగా ఉన్నాడు.

"ఈసారి కాంగ్రెసుకు ఓటువేస్తే చూడు," అన్నాడు.

"అదేం ?" అన్నాను.

"ఎమర్జెన్సీ అని నా మూడోతమ్ముణ్ణి గద్దలు తన్నుకుపోయినట్టు తన్నుకు పోయారు. వాణ్ణి ఎక్కడ పెట్టారో తెలుసుకోవటానికి నాకు మూణ్ణెల్లు పట్టింది," అన్నాడు.

"నీకింకా ఇద్దరు తమ్ముళ్లున్నారు. ఇద్దరు కొడుకులు జైల్లో పెట్టే ఈడు వాళ్ళు – వాసెక్టమీ చేసే ఈడువాళ్లు – ఉన్నారు. రేపు కాంగ్రెసు గెలిచిం దనుకో – ఎందుకు గెలవరు ? – వాళ్ల గతి ఆలోచించావా ?" అన్నాను.

"వాసెక్టమీ ఏమిటీ నీ తలకాయ ? పెద్దవాడికి పదిహేనోఏడు", అన్నాడు సుబ్బారాయుడు.

"నాకు తెలుసునయ్యా ! పదకొం డేళ్ళ వాళ్ళను కూడా స్టెరిలైజుచేసి పారేస్తున్నారు. కాంగ్రెసు దెబ్బ నీకింకా తెలీదా ?" అన్నాను.

సుబ్బరాయుడు బెదిరాడు. "ఇంత జరిగాక మళ్ళీ కాంగ్రెసు గెలుస్తుం దంటావా ?" అన్నాడు.

"నువ్వంటే రాజకీయ చైతన్యంగల వాడివి. మామూలు మనుషులు వట్టి గొర్రెలే గద ! నీ ఒక్క ఓటు కాంగ్రె సుకు తక్కువవుతుందా ? ప్రతిపక్షాలకు ఓటుచేశావంటే నిన్ను కాంగ్రెసు వెయ్యికళ్ళతో కనిబెట్టుతూ ఉంటుంది. అందులోనూ నువు అనుమానితుల జాబి తాలో వాడివి. ఇంకా నయం నిన్ను వోటర్ల లిస్టులో ఉండనిచ్చారు," అన్నాను.

సుబ్బారాయుడు కాంగ్రెసుకు ఓటు చేశాడు. నేను ఉడతాభక్తిగా ఒక ఓటు కాంగ్రెసుకు సంపాదించిపెట్టాను. చాలామంది సుబ్బారాయుళ్లు ఇదే విధంగా రాజకీయ చైతన్యం – రాజకీయాల నుంచి ఆత్మరక్షణ చేసుకోవటం – ప్రదర్శించి ఉంటారు.

*కొడవటిగంటి కుటుంబరావు*